# చంద్రబాబు మోసాలను ప్రశ్నించండి

● 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి



సభలో కూటమి మోసపూరిత పాలనను వివరిస్తున్న మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవాలన్న దురాశతో అమలు సాధ్యం కాని హామీలిచ్చి, ఇప్పుడు అవేవీ అమలు చేయకుండా తప్పించుకుతిరుగుతున్న సీఎం చంద్రబాబును నిలదీయాలని, ఆయన చేస్తున్న మోసాలను ప్రశ్నించాలని మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా స్థానిక నగరపాలక సంస్థ పరిధిలోని రెండో డివిజన్‌లోని పూల్‌బాగ్ కాలనీలో శుక్రవారం పర్యటించిన ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం కార్పొరేటర్ బండారు ఆనంద్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లిన ఆయన కూటమి ఏడాది పాలనలో ప్రజలు మోసపోతున్న తీరు..ప్రభుత్వం ప్రజలను మోసగిస్తున్న వైనాన్ని క్షుణ్ణంగా వివరించారు. 2024 ఎన్నికలకు ముందు అధికారం కోసం టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడి లేనిపోని హామీలిచ్చాయని, తీరా వారు అధికారంలోకి వచ్చాక వాటి అమలు విస్మరించారన్నారు. వారిచ్చిన హామీల అమలు గ్యారెంటీకి చంద్రబాబు, పవన్ ఫొటోలతో కూడిన బాండ్‌లు కూడా పంపిణీ చేసి, ఏ ఒక్క పథకమూ పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఇది ముమ్మాటికీ ప్రజలను మోసం చేయడమేనన్నారు. ఇప్పటివరకు ఇచ్చిన ఒకట్రెండు పథకాలు కూడా ఎంతోమంది అర్హులకు ఇవ్వలేదని, ఇచ్చిన కొంతమందిలో కూడా హెచ్చుతగ్గులు ఉన్నాయన్నారు. ఒకరికి తల్లికి వందనం కింద రూ.13 వేలు పడితే మరొకరికి రూ.10 వేలు పడిందన్నారు. ఇది కాదా వంచించడం అని నిలదీశారు. ఒకట్రెండు పథకాలు అరకొరగా ఇచ్చి, అన్ని పథకాలు అమలు చేసేసినట్లు గొప్పలు చెప్పుకోవడం వారికే చెల్లిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు, 18 ఏళ్లు నిండిన మహిళలకు ప్రతినెలా రూ.1500, 50 ఏళ్లు దాటిన బీసీలకు పెన్షన్ ఇలాంటి ఎన్నో పథకాలు హామీలుగా ఇచ్చారని, వాటిని ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ ప్రధాన ప్రతిపక్షంగా చేసిన బాధ్యతాయుత పోరాటం వల్లే ఆ ఒకట్రెండు పథకాలైనా ప్రజలకు అందాయన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై నిలదీత మొదలవుతుందనే సమయానికి రాష్ట్రంలో ఏదో ఒక విధ్వంసం సృష్టిస్తూ డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీస్తున్నారని మండిపడ్డారు. ప్రజల పక్షాన పోరాడే వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అన్యాయంగా కేసులు బనాయించి, వేధిస్తున్నారని ధ్వజమెత్తారు. దేశంలో మరే రాష్ట్రంలో లేనంత వ్యతిరేకత ఇక్కడి కూటమి ప్రభుత్వం మూటగట్టుకుందని, ఇదే వారి పాలనా వైఫల్యానికి నిదర్శనమన్నారు. చంద్రబాబు, పవన్‌ల గారడీ మాటలు మున్ముందు నమ్మితే భవిష్యత్ తరాలు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వారి మోసపూరిత పాలనను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు.



సమావేశానికి హాజరైన ప్రజలు

**వైఎస్సార్ సీపీ పాలనే భేష్..**

గడిచిన ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా జరిగిందన్నారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంక్షేమమే లక్ష్యంగా అన్నివర్గాలకు మేలు చేకూరుస్తూ పథకాలు ప్రవేశపెట్టి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అమలు చేసేశారని గుర్తు చేశారు. అలాగే నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారని, ప్రభుత్వ వైద్య కళాశాలలు, పోర్టులు, జెట్టీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇదే క్రమంలో విజయనగరం జిల్లా కేంద్రంలో అనేకానేక అభివృద్ధి పనులు చేశామన్నారు. రోడ్లు, కాలువలు, మంచినీటి ట్యాంకుల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు వంటివి ఎన్నో చేయడం జరిగిందన్నారు. జిల్లా కేంద్ర సమగ్రాభివృద్ధికి పాటుపడ్డామన్నారు. ప్రస్తుతం అధికారంలోని కూటమి నాయకులు, ప్రభుత్వం ప్రజలకు ఉపకారం చేసే ఆలోచన లేకుండా పాలన కొనసాగిస్తున్నాయని విమర్శించారు. అధికారంలో ఉన్నా లేకున్నా వైఎస్సార్ సీపీ ఎప్పుడూ ప్రజల పక్షానే పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టివీరవెంకట రాజేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారునాయుడు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు గదుల సత్యలత, జిల్లా కార్యదర్శి బొద్దాన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట

● 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడ్డుకొండ అప్పలనాయుడు



గొలగాంలో జరిగిన సభలో కూటమి పాలనపై నిప్పులు చెరుగుతున్న బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: ప్రజలను మోసం చేయడంలో సీఎం చంద్రబాబు మంచి దిట్ట అని నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడ్డుకొండ అప్పలనాయుడు విమర్శించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మోపాడ, గొలగాం, అక్కివరం, బంటుపల్లి, గొడిపాలెం గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన ఆయకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన..కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సూపర్ సిక్స్ హామీలేవీ అమలు చేయకుండా జనాన్ని మోసం చేస్తున్న తీరును వివరించారు. ఆ తర్వాత జరిగిన సభల్లో కూటమి ఏడాది పాలనపై నిప్పులు చెరిగారు. గతంలోని వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వం ఏర్పడిన ఏడాదికే మేనిఫెస్టోలో పేర్కొన్న అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందని, ఇప్పుడు అధికారంలోని కూటమి ప్రభుత్వం మాత్రం గద్దెనెక్కి ఏడాది దాటినా ఎందుకు పథకాలన్నీ అమలు చేయలేకపోతోందని నిలదీశారు. పథకాలన్నీ అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తుంటే సీఎం చంద్రబాబు మాత్రం ప్రస్తుత రాష్ట్ర బడ్జెట్ చూసి భయమేస్తోందని, పథకాల అమలు తమ వల్ల కాదనే రీతిలో స్పందించడం తప్పించుకునే ప్రయత్నమేనన్నారు. ఎన్నికల సమయంలో ఓట్లు, అధికారం కోసం అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చినప్పుడు రాష్ట్ర ఖజానా గుర్తు లేదా అని ప్రశ్నించారు. ఏది ఏమైనా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయించేంత వరకు వైఎస్సార్ సీపీ పోరాటం ఆగదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందివ్వడం జరిగిందన్నారు. ప్రతి కుటుంబానికీ లక్షలాది రూపాయలు ప్రయోజనం చేకూరిందన్నారు.

**మరోసారి చంద్రబాబు, పవన్‌లను నమ్మరు..**

ఇప్పటికీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు పథకం ద్వారా అభివృద్ధి చేసిన పాఠశాలలు, ప్రతి గ్రామంలో ఉన్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు అభివృద్ధికి నిలువెత్తు తార్కాణాలుగా నిలుస్తున్నాయన్నారు. తాము ఏం చెప్పినా, చేసినా ప్రజలు నమ్ముతారనే గర్వంతో కూటమి నాయకులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. మరోసారి చంద్రబాబు, పవన్‌లను జనం నమ్మే పరిస్థితి ఉండదని జోష్యం చెప్పారు. ఎమ్మెల్యే లోకం నాగమాధవి కూడా గెలిచిన వంద రోజుల్లో వంద కంపెనీలు తెచ్చి, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామన్నారని ఆమె అనుకున్నది జరిగి సంవత్సరం కాలం దాటినా ఆమె ఇచ్చిన హామీ నెరవేరే దాఖలాలు కనిపించడం లేదన్నారు. ఇప్పటికే గతంలోని వైఎస్సార్ సీపీ పాలనకు ప్రస్తుత కూటమి పాలనకు ఉన్న తేడాపై ప్రజల్లో చర్చ మొదలైందన్నారు. రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీదే భవిష్యత్ అన్నారు. పార్టీ శ్రేణులంతా ధైర్యంగా ప్రజలకు జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలపై పోరాడాలని, జనానికి మన వల్ల మంచి జరిగితే మరోసారి అవకాశం ఇస్తారన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ బ్రోచర్లను పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పిన్నింటి తమ్మునాయుడు, నాయకులు బడ్డుకొండ ప్రదీప్‌నాయుడు, కోరాడ కోటినాయుడు, బడ్డుకొండ రమేష్, బూర్లె అప్పలనాయుడు, కలిశెట్టి రామకృష్ణ, లెంక లక్ష్మణరావు, కోరాడ కనకరాజు, రేగాన శ్రీనివాసరావు, పతివాడ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



గొడిపాలెం సభలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ, తదితరులు

## క్లుప్తంగా

### అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు



గొడౌన్‌లోని ఎరువుల నిల్వలను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

నెల్లిమర్ల: ఎరువులు గానీ పురుగుమందులు గానీ నిర్దేశిత ధరల కన్నా ఎక్కువ ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ టి.అప్పలనాయుడు హెచ్చరించారు. స్థానిక పట్టణంలోని శ్రీనివాస ట్రేడర్స్ ఎరువుల షాపులో పలాస ఏడీఏ ఎం.రామారావుతో కలిసి ఆయన శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. గొడౌన్‌లోని ఎరువుల నిల్వలు, రికార్డులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతుల నుంచి ఎరువుల నాణ్యతపై ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా సహించేది లేదన్నారు. ఆయన వెంట ఏవో శ్రీలక్ష్మి, ఏఈవోలు కుర్మారావు, నాగరాజు, రమేష్ తదితరులు ఉన్నారు.

### రాములోరి సన్నిధిలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి



శ్రీరామునికి పూజలు చేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రామ్‌భూపాల్

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థానాన్ని తెలంగాణ పీసీసీ ప్రధాన కార్యదర్శి సీహెచ్ రామ్‌భూపాల్ శుక్రవారం సందర్శించారు. వ్యక్తిగత పర్యటన నిమిత్తం ఉత్తరాంధ్రకు విచ్చేసిన ఆయన ఆలయానికి వెళ్లి, సీతారామస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు వేదాశీర్వచనాలు అందజేసి, స్వామి వారి వైభవాన్ని వివరించారు.

### ప్రజలకు మెరుగైన వైద్యం అందించండి



క్షయతో బాధపడుతున్న వారికి పౌష్టికాహారం అందజేస్తున్న డీఎంహెచ్‌వో జీవనరాణి

నెల్లిమర్ల రూరల్: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో జీవనరాణి సూచించారు. మండలంలోని కొండవెలగాడ గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె శుక్రవారం సందర్శించారు. ఆస్పత్రి పరిసరాల పరిశుభ్రత, రికార్డులు, రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఆస్పత్రికి వస్తున్న ప్రతి రోగికి క్షుణ్ణంగా ఆరోగ్య తనిఖీ చేసి, అవసరమైన చికిత్స, మందులు అందజేయాలని తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడే అవకాశం ఉందని, ఏ ఒక్కరూ వ్యాధుల బారినపడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం క్షయ రోగులకు ఫుడ్‌బాస్కెట్లు పంపిణీ చేశారు.

### నియామకం

విజయనగరం: వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా చీపురుపల్లి నియోజకవర్గానికి చెందిన జమ్ము చిన్నంనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా చిన్నంనాయుడు నియామకం పట్ల మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

### శాకంబరిగా ముత్యాలమ్మ



కూరగాయల అలంకరణలో ముత్యాలమ్మ

జామి: మండలంలోని అలమండ గ్రామంలో ఆషాఢమాస శుక్రవారం పురస్కరించుకుని స్థానిక ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారిని శాకంబరీగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

### వాసవీమాతకు సారె సమర్పణ

జామి: మండల కేంద్రంలో కొలువైన వాసవీ కన్యకాపరమేశ్వరికి ఆషాఢమాసం సందర్భంగా ఆర్యవైశ్య మహిళలు శుక్రవారం సారె సమర్పించారు. ముందుగా అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు రవికుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతుబజార్‌ను తరలిస్తే ఊరుకోం..

● సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

విజయనగరం గంటస్తంభం: పాత ఆస్పత్రి వద్ద ఉన్న రైతుబజార్‌ను తరలించి, రైతులకు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకోబోమని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ హెచ్చరించారు. ఇదే విషయమై ఆయన స్థానిక ఎల్బీజీ భవన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. రైతుబజార్ తరలించేదుకు అధికార యంత్రాంగం చేస్తున్న చర్యలను సీపీఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. 1999 నుంచి రైతుబజార్ అక్కడే ఉందని, 26 ఏళ్లుగా అనేక కుటుంబాలు దానిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయన్నారు. నగర ప్రజలకు అందుబాటులో ఉన్న స్థలాన్ని ఎమ్మెల్యే.., అశోక్ గజపతిరాజులు 26 ఏళ్ల పాటు ఊరుకుని, ఇప్పుడు ఆ రైతుబజార్ భూమి తమదని, తమకు ఆ భూమి అప్పగించాలని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడం సరికాదన్నారు. విద్యా దాతలు, భూదాతలు అని చెప్పుకునే ఈ రాజుల వంశం ఈ విధంగా చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. అద్దెలు కట్టుకుని, పన్నులు చెల్లించి కూరగాయలు అమ్ముకొని జీవిస్తున్న వారిని తీసేయడమనేది వారి పొట్టకొట్టడమేనన్నారు. ప్రస్తుతం అక్కడ భూమి ఖరీదైనది కాబట్టి ఈ భూమిని లాగేసుకోవడానికి ప్రయత్నం చేయడం దుర్మార్గం తప్ప మరొకటి కాదన్నారు. జిల్లాలో వేల ఎకరాలు భూములు ఉండి ఈ భూమి మీదకు రావడంలో రహస్యమేంటన్నారు. జిల్లాకు పెద్దగా ఉన్న ఆయన ఈ విధంగా చేయడం ఎంతమాత్రం సరికాదన్నారు. ఎమ్మెల్యే కూడా భూముల మీద దృష్టి పెట్టినట్లు తెలుస్తోందన్నారు. ల్యాండ్ సీలింగ్ వచ్చిన తర్వాత ప్రభుత్వ భూములు ఈ విధంగా లాగేసే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఖాళీ చేయాలని చెప్పడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. రైతుబజార్‌ను అక్కడే ఉంచాలి లేదంటే రైతులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఆయన వెంట సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, వి.లక్ష్మి తదితరులు ఉన్నారు.

## నిబంధనలు బేఖాతరు!





బాలాజీ జంక్షన్ సమీపంలో నిర్వహిస్తున్న మద్యంబార్‌లివే..

విజయనగరం జిల్లా కేంద్రంలో మద్యంబార్ అండ్ రెస్టారెంట్‌ల నిర్వాహకులు నిబంధనలు బేఖాతరు చేస్తున్నారు. సాధారణంగా ఆలయాలు, పాఠశాలలకు వంద మీటర్ల దూరంలో ఎటువంటి మద్యం షాపులు ఉండకూడదన్నది నిబంధన కాగా బాలాజీ జంక్షన్‌లోని రెండు మద్యంబార్‌లూ మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలకు కేవలం 30 మీటర్ల దూరంలోనే ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఈ బార్‌లు నిర్వహిస్తున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

–విజయనగరం



మద్యంబార్‌లకు 30 మీటర్ల దూరంలో ఉన్న ప్రభుత్వ మహారాజా సంగీత, నృత్య కళాశాల

### 20న పెందుర్తిలో కొప్పలవెలమ సంఘ సమావేశం

విజయనగరం అర్బన్: విశాఖలోని పెందుర్తిలో ఉన్న తాండ్రపాపారాయుడు వెలమ భవన్‌లో ఈ నెల 20వ తేదీన కొప్పలవెలమ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండారు పెదబాబు, కోళ్ల రవిబాబులు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఈ సమావేశానికి సంఘ జాతీయ కన్వీనర్లు కూనిరెడ్డి శ్రీనివాస్, రావు శంబంగి, రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొరుపోలు సత్యారావు, బొమ్మినాయుని తిరుపతిరావు, రాష్ట్ర గౌరవ సలహాదారులు చీపురుపల్లి వెంకటరావు తదితరులు హాజరవుతారని, కుల సంఘ నాయకులుంతా హాజరుకావాలని కోరారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో కొప్పలవెలమలకు సంబంధించి అపరిష్కృతంగా పడి ఉన్న రాజకీయ, సామాజిక, ఆర్థిక సమస్యల పరిష్కారంపై చర్చించడం జరుగుతుందన్నారు.

### శక్తి యాప్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ గోవిందరావు

విజయనగరం క్రైమ్: నగరంలోని సెయింట్ ఆన్స్ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు శక్తి యాప్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. మహిళలు, విద్యార్థినులకు రక్షణగా ప్రభుత్వం ఈ శక్తి యాప్ తీసుకువచ్చిందని, ప్రతిఒక్కరూ ఈ యాప్‌ను తమ స్మార్ట్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఎస్పీ గోవిందరావు తెలిపారు. ఎవరైనా ఆపదలో చిక్కుకున్నప్పుడు ఎస్‌వోఎస్ బటన్ నొక్కితే మీరున్న చోటకే పోలీసులు వచ్చి రక్షణ కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ శిరీష తదితరులు పాల్గొన్నారు.

# 'మత్తు' వదిలితేనే బంగారు భవిష్యత్



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ గణేష్

నెల్లిమర్ల రూరల్: యువత మత్తు పదార్థాలు వీడితేనే బంగారు భవిష్యత్ ఉంటుందని ఎస్‌ఐ గణేష్ తెలిపారు. పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని సారిపల్లి గ్రామంలో గురువారం రాత్రి బస చేసిన ఎస్‌ఐ.. గ్రామస్తులకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఫ్యాషన్ మాయలో ఎంతోమంది యువత గంజాయి, కొకైన్, హెరాయిన్, గుట్కా, మద్యం, సారా, సిగరెట్ వంటి మత్తు పదార్థాలకు బానిసలై జీవితం నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలకు బానిసలైన ఎంతోమంది చిన్న వయసులోనే చనిపోయి వారి కుటుంబాలకు విషాదం మిగిల్చారన్నారు. ప్రతి ఒక్కరూ మంచి అలవాట్లు పెంపొందించుకుని, ఆదర్శవంతమైన జీవనం సాగించాలని కోరారు.

# శ్మశానవాటిక షెడ్డు తొలగింపుపై విచారణ



విచారణ చేస్తున్న ఎంపీడీవో రాధిక

పూసపాటిరేగ: మండలంలోని కొవ్వాడఅగ్రహారం గ్రామ శ్మశానవాటిక షెడ్డు తొలగింపుపై పలువురు చేసిన ఫిర్యాదు మేరకు ఆ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో ఎం.రాధిక శుక్రవారం విచారణ చేపట్టారు. ఈ విచారణకు గ్రామానికి చెందిన 150 మంది వరకు హాజరు కాగా శ్మశానవాటిక షెడ్డు ఎందుకు తొలిగించారని ఎంపీడీవో ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలాల్లోని కట్టడాలు తొలగించే ముందు నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకోవాలని తెలీదా అని ఎంపీడీఓ నిలదీశారు. దీనికి పలువురు గ్రామస్తులు స్పందించి, వాస్తుకు విరుద్ధంగా ఉందనే కారణంతోనే శ్మశానవాటిక షెడ్డు తొలగించడం జరిగిందని, దీనికి గ్రామస్తులందరి అభిప్రాయం తీసుకున్నామని తెలిపారు. వారు షెడ్డు తొలగిస్తున్నప్పుడు విషయం తెలియజేశారా అని కార్యదర్శిని ఎంపీడీవో ప్రశ్నించగా, తనకు తెలియదని కార్యదర్శి సమాధానం ఇచ్చారు. దీనిపై మూకుమ్మడిగా గ్రామస్తులు మాట్లాడుతూ తొలగించిన శ్మశానవాటిక షెడ్డుకు బదులుగా చందాలు ఎత్తుకుని మరో షెడ్డు నిర్మించుకుంటామని ఎంపీడీవోకి తెలియజేశారు. ఇదిలా ఉండగా షెడ్డు తొలగింపుపై ఫిర్యాదు చేసిన సోమాదుల సోముబాబు, చందక హరిబాబు, లెంక సురేష్‌లు విచారణకు హాజరు కాకపోవడం ఏంటని గ్రామస్తులు సభలో అడిగారు. గ్రామాభివృద్ధికి కలిసికట్టుగా నిర్ణయం తీసుకుంటామని, షెడ్డు ఎక్కడ నిర్మాణం చేయాలో నిర్ణయించిన తర్వాతనే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని సభలో గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ జ్ఞానేశ్వరరావు, సర్పంచ్ కోట్ల రఘు తదితరులు పాల్గొన్నారు.

# బాలికల భద్రతకు శక్తి వారియర్స్ టీమ్‌లు



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ గణేష్

నెల్లిమర్ల: బాలికల భద్రత కోసం అన్ని విద్యాలయాల్లో శక్తి వారియర్ టీమ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌ఐ గణేష్ తెలిపారు. స్థానిక పట్టణంలోని సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శక్తి వారియర్ టీమ్ ఆవశ్యకతపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చాలామంది బాలికలు ఈవ్ టీజింగ్, బాలుర అసభ్యకర ప్రవర్తన తదితర విషయాలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బంది పడుతున్నారన్నారు. అటువంటి వారి సమస్యల పరిష్కారానికి టీమ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఒక్కో తరగతి నుంచి నలుగురు బాలికలను శక్తి వారియర్స్‌గా ఎంపిక చేస్తామని, వారి ద్వారా బాలికల సమస్యలను పోలీసులకు తెలియజేసేందుకు అవకాశం ఉంటుందన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయనగరం
9951602843
Office mail : vzmadvt@gmail.com